

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

***రచనాకాలం: 2000 సంవత్సరం***

**"అన్నం వడ్డిస్తున్నాను.** అంతారండి" చెప్పింది మాలతి.

"ఏరా! అమెరికా వెళ్ళావు, తిరిగి వచ్చేశావు. మరి నీ భవిష్యత్ కార్యక్రమాలేమిటి?" అడిగాడు అరుణాచలం పెద్దకొడుకు గోపీనాథ్‌ని.

"ఏదయినా చిన్నవ్యాపారం మొదలుపెట్టి దాన్ని పెద్ద వ్యాపారంగా మార్చడం."

"ఏం వ్యాపారం చేద్దామనుకుంటున్నావు?"

"ఇండియాకి నాలుగేళ్ళ తర్వాత కదా తిరిగివచ్చింది. ఓ నెలరోజులు స్టడీచేసి ఏం వ్యాపారం చెయ్యాలో చూడాలి."

"విరించి కూడా నీకు తోడుగా వుంటాడు" చెప్పింది తల్లి.

"వాడ్నిక్కడ ఎందుకు వుంచుతాం? అమెరికా పంపేద్దాం" చెప్పాడు గోపీనాథ్.

"బి.కామ్ డిగ్రీగాడికి అమెరికాకి వెళ్ళేందుకు ఏ వీసా యిస్తారు?" అడిగాడు అరుణాచలం.

"నేను వెళ్ళిన మార్గంలోనే వెళతాడు. పొలిటికల్ అసైలమ్‌కి అప్లై చేస్తాడు."

"నిన్ను తిప్పి పంపించేశారుగా? మళ్ళీవాడు కూడానా?" అడిగింది మాలతి గాభరాగా.

"నేను తెలిసీ తెలియక వెళ్ళానమ్మా. ఇప్పుడు దాని గురించిన వివరాలన్నీ పూర్తిగా తెలిశాయి. కాబట్టి అక్కడ అసైలమ్ తెచ్చుకోవడం ఎలాగో, నేను చేసిన పొరపాట్లు ఏమిటి, ఆ పద్ధతులన్నీ కొట్టిన పిండి అయ్యాయి. కాబట్టి ఇక వాడికి ఢోకాలేదు. తప్పకుండా అసైలమ్ విషయంలో సక్సెస్ అవుతాడు" చెప్పాడు గోపీనాథ్.

"మళ్ళీ ఏభైవేలు ఖర్చు" గొణిగాడు అరుణాచలం.

"ఈసారి వృధాఖర్చు కాదు" ఎంకరేజింగ్‌గా చెప్పాడు గోపీనాథ్.

"అసలు ఈ లాటరీ గురించి నీకెలా తెలుసురా?" అడిగింది మాలతి విరించిని.

"ఏటా అమెరికన్ ప్రభుత్వం మన దినపత్రికలో ఈ లాటరీ గురించి ప్రకటనలు ఇస్తుంటుంది. వార్త డెయిలీలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఆ ప్రకటనలు. దీనికి అప్లై చేశాను" చెప్పాడు విరించి.

"ఏరా! నీకిష్టమేనా?" అడిగింది తల్లి విరించిని.

"ఇష్టమేనే. కష్టపడకుండా ఏదైనా ఎలా సాధించగలం చెప్పు."

"అసలు పొలిటికల్ అసైలమ్ అంటే ఏమిటి? నాకింకా అర్థం కాలేదు" అడిగాడు అరుణాచలం.

"ప్రపంచంలో చాలా దేశాలు, ముఖ్యంగా యూరప్‌లోని జర్మనీ, ఇంగ్లండ్, ఇటలీలాంటి ఐశ్వర్యవంతమైన దేశాలు ఏదైనా దేశం నుంచయినా రాజకీయ బాధితులై వచ్చిన వాళ్ళకి తమ దేశంలో వుండనిచ్చే హక్కునిస్తారు నాన్నా. అమెరికాకి కూడా ఈ పాలసీ వుంది. నేను బెనారస్ యూనివర్సిటీలో పి.హెచ్.డి చేస్తున్నప్పుడు దీని గురించి తెలిసింది" గోపీనాథ్ చెప్పేది అందరికన్నా శ్రద్ధగా వినసాగాడు విరించి.

"ఏదైనా పొలిటికల్ పార్టీ లేదా స్టూడెంట్ గ్రూప్, యూనియన్, రెలిజియస్ ఆర్గనైజేషన్, మిలటరీగ్రూప్, గెరిల్లా ఆర్గనైజేషన్, ఎథ్నిక్ గ్రూప్, హ్యూమన్ రైట్స్ గ్రూప్ లేదా ఇంకేదైనా గ్రూప్ వల్ల మనకి ప్రాణనష్టం సంభవిస్తుందన్న భయం వుంటే అది అమెరికన్ ప్రభుత్వం నమ్మేలా చెప్పగలిగితే మన ప్రాణరక్షణకిగాను మనకి ఆ దేశంలో పొలిటికల్ అసైలమ్ ఇస్తారు."

"బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ఆ దేశం నుంచి వచ్చిన అనేకమంది కాందిశీకులకి మనదేశంలో రక్షణ కల్పించినట్లుగానా?" అడిగాడు అరుణాచలం.

ఆయన పనిచేసే సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీస్‌లో రాయ్ అనే అతను అలా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన కాందిశీకుడు. రిజర్వేషన్‌లో అతనికి ఆ ఆఫీస్‌లో ఉద్యోగం లభించింది.

"అవును. సరిగ్గా అలాంటిదే ఇది. అప్పట్లో నార్త్‌లో చాలామంది పంజాబి యువకులు తమకి పంజాబ్ టెర్రరిస్ట్‌ల నుంచి ప్రాణభయం వుందని చెప్పి, అమెరికా వెళ్ళి పొలిటికల్ అసైలమ్‌కి అప్లై చేసారు. అలా వెళుతున్న ఓ పంజాబీ క్లాస్‌మేట్ నాకు ఆ విషయాలు చెప్పాడు. దాంతో ఉత్సాహం పుట్టి నేనూ వెళ్ళాను. కానీ సగం జ్ఞానం వల్ల ఏం జరుగుతుందో అదే జరిగింది నా విషయంలో. ఇప్పుడు ఆ విషయాల్లో పూర్తిజ్ఞానంతోవుంది కాబట్టి విరించిగాడ్ని సక్సెస్‌ఫుల్‌గా అమెరికాలో స్థిరపడేలా చేసే పూచీ నాది" చెప్పాడు గోపీనాథ్

"నువ్వేమంటావు అమ్మా?" అడిగాడు విరించి.

"నేను పక్కమీద పడేదాకా మీరు ఎక్కడున్నా నాకు ఒకటే. కానీ ఆ సమయంలో నన్ను చూసుకోడానికి మీ ఇద్దరిలో ఒక్కరైనా నా దగ్గరుంటే చాలు" చెప్పింది మాలతి.

"నువ్వేమంటావు నాన్నా?" అడిగాడు విరించి తండ్రిని.

"మా జీవితంలో ముప్పాతిక భాగం అయిపోయింది. మీది పాతిక భాగం కూడా కాలేదు. కాబట్టి ఎలాచేస్తే మీ భవిష్యత్తు బావుంటుందో అలా చేయండి. దానికి నేను అడ్డురాను. నేనున్నా లేకపోయినా తర్వాత 'నాన్న అడ్డుపడ్డారు' అని మీరు తిట్టుకుంటే నాకు బావుండదు" చెప్పాడు అరుణాచలం.

"అంటే మీ ఇద్దరూ ఇందుకు ఓకే చేసినట్లేగా?" అడిగాడు గోపీనాథ్

వారి తల్లితండ్రుల్లో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

"గుడ్ అయితే హనుమజ్జయింతినుంచి ఆ కార్యక్రమంలో వుంటాం" చెప్పాడు గోపీనాథ్

"ఏ కార్యక్రమంలో?" అడిగింది తల్లి.

"చాలా బృహత్ కార్యక్రమం అది. అవసరం వచ్చినపుడల్లా చెప్తుంటాను. పోలీసులు, క్రిమినల్ కేసులు, అచ్చం క్రయిం థ్రిల్లరే" చెప్పాడు గోపీనాథ నవ్వుతూ.

కాసేపాగాక అడిగాడు గోపీనాథ్

"నీ ఫ్రెండ్ ప్రభాకర్ ఏం చేస్తున్నాడు?"

"చాలా ఎక్కడా ఉద్యోగం దొరక్కపోవడంతో జిరాక్స్ షాపు నడుపుతున్నాడు."

"వెరీగుడ్‌! అయితే ఓసారి అతనితో మాట్లాడాలి.." చెప్పాడు గోపీనాథ్‌

## 3

నాలుగేళ్ళ క్రితం లేని ఫ్లైఓవర్లు, కొత్తరోడ్లు వెడల్పయిన పాతరోడ్లు, ఎత్తయిన అపార్ట్‌మెంట్లు, ఇ మెయిల్ బూత్స్‌, టాటా టెలిస్మార్ట్‌ బూత్స్‌, ఫాస్ట్‌ ఫుడ్‌ కార్నర్లు మొదలైనవి కనిపించసాగాయి గోపీనాథ్‌కి.

"హైదరాబాద్‌ ఈ నాలుగేళ్ళలో బాగా అభివృద్ధి చెందింది" చెప్పాడు గోపీనాథ్‌ స్కూటర్ని పోనిస్తూ వెనక కూర్చున్న విరించితో.

ఇద్దరూ నెక్లెస్‌ రోడ్‌కి చేరుకున్నారు. స్కూటర్‌ పార్క్‌ చేసి నడిచారు. ఒకవైపు టేంక్‌బండ్‌, మరోవైపు నెక్లెస్‌రోడ్‌, మధ్య ప్రజలు నడవడానికి, కూర్చోడానికి స్థలం. ఇద్దరూ ఫౌంటెన్‌ దగరకి నడిచారు. ఫౌంటెన్‌ గట్టుమీద కూర్చోపెట్టి పిల్లలకి ఇంటిదగ్గర కలిపి తెచ్చిన అన్నం తినిపిస్తున్నారు తల్లిదండ్రులు.

రెయిలింగ్‌ దగ్గరకి నడిచారు. ఎదురుగా నీటిమధ్య బుద్ధ విగ్రహం, దానికి ఆవల టేంక్‌బండ్‌ మీది పచ్చటి లైట్లు, వాటిమీద తిరిగే కార్ల హెడ్‌లైట్ల వెలుగు, మరికొద్ది దూరంలో వైస్‌రాయ్‌ హోటల్‌, మరోవైపు తెల్లటి బిర్లామందిర్‌ కనిపిస్తున్నాయి.

"నీలా పొలిటికల్‌ అసైలమ్‌ కి అప్లయ్‌ చేసిన రెడ్డి నిన్న నాకు ఇ మెయిల్‌ పంపాడు. ఇ.ఒ.ఐ.ఆర్‌ కి సస్పెన్షన్‌ ఆఫ్‌ డిపోర్టేషన్‌కి అప్లయ్‌ చేసుకున్నానని."

"ఇ.ఒ.ఐ.ఆర్‌ అంటే ఏమిటి?" అడిగాడు విరించి వెంటనే.

"ఎగ్జిక్యూటివ్‌ ఆఫీస్‌ ఫర్‌ ఇమ్మిగ్రేషన్‌ రివ్యూకి షార్ట్‌ఫాం ఇ.ఒ.ఐ.ఆర్‌. ఎవర్నయినా డిపోర్ట్‌ చేయమని ఆర్డర్స్‌ వస్తే దానికి వ్యతిరేకంగా తనని అమెరికా దేశం నుంచి బహిష్కరించడాన్ని సస్పెండ్‌ చేయమని అప్లయ్‌ చేసుకోవచ్చు. తనకేసు విచారణకి వచ్చి, ఇమ్మిగ్రేషన్‌ కోర్ట్‌ జడ్జి తీర్పు ఇవ్వడానికి కొంత టైం పడుతుంది. అంతదాకా అమెరికాలో ఉద్యోగం చేస్తూ సంపాదించుకోవచ్చు. "

"మరి నువ్వాపని చెయ్యలేదే అన్నాయ్‌?" అడిగాడు విరించి.

"అమెరికాలో నాలుగేళ్ళున్నాక ఆ దేశం మీద మోజు తీరిపోయింది కనక."

"దేనికి మోజు తీరిపోయింది?"

"అక్కడ మన దేశంలోలా జీవన స్వాతంత్ర్యం తక్కువ. ఏ రోజైనా చేసే ఉద్యోగం ఊడొచ్చు. జాబ్‌ సెక్యూరిటీ శూన్యం. ఉదయం ఆరుకి లేస్తే ఇంటికి రాత్రి తొమ్మిదికే రావడం. ఉద్యోగం ఇచ్చినవాళ్ళు సెలవు ఇవ్వడానికి చస్తారు. ఉద్యోగాల విషయంలో ఇక్కడి పరిస్థితి అమెరికా పూర్తిగా విరుద్ధం. అక్కడ మనుషులు తక్కువ, ఉద్యోగాలు ఎక్కువ. ఓరోజు మనం పని మానేస్తే మనకి బదులుగా ఇంకొకరు దొరకరు. ఇంకా ఫేమిలీకి దూరంగా వున్న ఆ వంటరి జీవితం ఒక్కోసారి దుర్భరంగా అనిపించేది. పైగా నేరాలెక్కువ. నేను ఓ పాకిస్తానీ స్టాల్‌లో నైట్‌ సేల్స్‌మెన్‌గా పనిచేస్తుండగా ఇద్దరు నల్ల వాళ్ళొచ్చి తుపాకి చూపించి కేష్‌ దోచుకెళ్ళారు. సాధారణంగా అలాంటప్పుడు కాల్చిగానీ పోరు. నా ప్రాణాలు ఆ రాత్రితో పోతాయనుకున్నాను. లక్కీగా నన్ను చంపలేదు వాళ్ళు."

"అందుకనేనా జె.సి. పెన్నీలో డే జాబ్‌లో చేరావు?"

"అవును."

"ఇక్కడా బాంబులు, తుపాకుల సంస్కృతి అధికంగానే వుంది" చెప్పాడు.

"ఇక్కడిది పూర్తిగా పొలిటికల్‌. సామాన్య మానవుడు ఎప్పుడోకానీ విక్టిమ్‌ కాడు. రాజకీయవేత్త, బాగా ధనవంతుడు ఇక్కడ ఎఫెక్ట్‌ అయ్యేది. అమెరికాలో అలాకాదు. రాత్రి కార్‌ పార్క్‌కి వంటరిగా నడుస్తుంటే ఏకారు చాటునుంచో తక్కున వచ్చి మగ్గింగ్‌ చేస్తారు. నేనున్న బర్కిలీ ఏరియాలో మరీ ఎక్కువ."

"అందుకని వచ్చేసావా?"

"అవును. ఐ.ఎస్.ఎస్. వాళ్ళు మమ్మల్ని డిపోర్ట్ చేయచ్చన్న అనుమానం రాగానే కూపర్ నెబ్రస్కాకి, రెడ్డి షికాగోకి పారిపోయారు."

వాళ్ళ మధ్య కొద్ది నిశ్శబ్దం. తర్వాత చెప్పాడు గోపీనాథ్

"దేనికదే చెప్పాలి. ఈ నాలుగేళ్ళలో నేను సంపాదించింది మొత్తం ఎనభై రెండువేల డాలర్లు. అందులో నా మెయిన్‌టెనెన్స్ కయింది ఇరవై తొమ్మిదివేల డాలర్లు. మిగిలింది సేవ్ చేసి ఇండియా పంపాను. ఇదే ఇండియాలో వుంటే యాభై మూడువేల డాలర్లు అంటే సుమారు ఇరవై లక్షల రూపాయలు ఆ కాస్త కాలంలో సేవ్ చేయలేను."

"నెలకి ఆరువందల డాలర్లే ఖర్చయ్యేదా నీకక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు విరించి మనసులో లెక్కవేసుకుని.

"అవును. నాలుగేళ్ళ క్రితం నేను ఇండియానుంచి వెళ్ళినప్పటికీ ఇప్పటికీ ఇక్కడ కాస్టాఫ్‌లివింగ్ చవక. నెలకి ఆరువందల డాలర్లు అపార్ట్‌మెంట్ అద్దె. నావంతు నూట యాభై, అక్కడ ఫుడ్ బాగా చవక. మూడువందల డాలర్లు ఫుడ్‌కి, ఓ వంద, నూట యాభై గేస్‌కి.. అంటే కారు పెట్రోల్‌కి, కారు ఇన్సూరెన్స్ ఇతర సాదర ఖర్చులకి సరిపోయేది."

"ఇండియాలో నెలకి ఆరువందల రూపాయలతో బ్రతకలేరెవరూ. నెలకి ఆరువందల డాలర్లతో ఎవరయినా అమెరికాలో బ్రతకచ్చా?" అడిగాడు విరించి.

"బేసిక్ నీడ్స్‌ని నెలకి ఆరువందల డాలర్లతో తీర్చుకుంటూ హాయిగా బ్రతకొచ్చు."

మరికొంత నిశ్శబ్దం తర్వాత అడిగాడు విరించి.

"నీకు అమెరికాకి వీసా దొరికినప్పుడు అసలు రాజకీయ పునరావాసం కోసం దేనికి అప్లై చేసావు?"

"అమెరికాకి రెండురకాల వీసా లిస్తారు. ఒకటి ఇమ్మిగ్రెంట్ వీసా అంటే అమెరికాలో శాశ్వతంగా వుంటూ ఉద్యోగం లేదా వ్యాపారం చేసుకోవచ్చు. రెండోది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా. ఆ వీసాలోని కాలపరిమితి ముగియగానే వెనక్కి తిరిగివచ్చేయాలి. వాళ్ళక్కడ పనిచేసి సంపాదించే హక్కుండదు. నే వెళ్ళింది నాన్ ఇమ్మిగ్రెంట్. వీసామీద వర్క్ చేసి సంపాదించాలంటే ఐ.ఎన్.ఎస్. అంటే ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీస్ అనే శాఖ వర్క్ పర్మిట్ ఇవ్వాలి. వీసా గడువు తీరాక పట్టుకుంటే డిపోర్ట్ చేసేస్తారు. నాన్ ఇమ్మిగ్రెంట్‌లో వెళ్ళిన వారికి అలా డిపోర్ట్ కాకుండా వుండటానికి, వర్క్ పర్మిట్ తీస్కోవడానికి సర్వరోగ నివారిణిగా పనిచేసేది ఒక్క పొలిటికల్ అసైలమ్ మాత్రమే."

"ఐసీ"

"నాలుగేళ్ళు నాన్ ఇమ్మిగ్రెంట్‌లో స్టేటస్ వుండి కూడా ఇమ్మిగ్రెంట్‌లా లీగల్‌గా పనిచేయగలగాలి."

"నువ్వు పొలిటికల్ అసైలమ్ ఏ గ్రౌండ్స్ మీద అప్లయ్ చేసానన్నాయ్?" అడిగాడు విరించి.

"నేను బెనారస్ యూనివర్శిటీలో చదువుతుండగా కొందరు ఖలిస్తాన్ వాళ్ళు నన్ను చంపాలనుకుంటే, అమెరికా వచ్చానని కలరిచ్చాను. అయితే దాన్ని రుజువు చేసే డాక్యుమెంటరి ఎవిడెన్స్ నా దగ్గర లేదు. రేపు నీకూ నాకూ తేడా అదే నువ్వు క్లెయిమ్ చేసే ప్రతీది డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌గా వాళ్ళకి ఇస్తావు."

"అసలిప్పుడు ఖలిస్తాన్ టెర్రరిస్ట్ సంస్థ ఏక్టివ్‌గా లేదుగా?"

చిన్నగా మందహాసం చేశాడు గోపీనాథ్.

"నువ్వు పాకిస్తాన్ గూఢచారి సంస్థ విక్టిమ్‌వి."

విరించి మాట్లాడలేదు.

"కార్గో షిప్ అంత్ అలోన్లీప్లేస్ ఈ ప్రపంచంలో అదొక్కటే. మూడు నెలలు ఖాళీ కాబట్టి నిన్ను ఈ దారిలో అమెరికా పంపి ఎలా సెటిల్ చేయాలో ఏ టూ జడ్ పథకం మొత్తం ఆలోచించి పర్‌ఫెక్ట్ చేశాను.."

కొద్ది క్షణాలు ఆలోచించి మళ్ళీ చెప్పసాగాడు గోపీనాథ్.

"ఇండియాలోని గొప్పదనం డబ్బిస్తే ఏదైనా చేయచ్చు. అమెరికాలో ఫలానా వ్యక్తిని, ఫలానా రోజు ఎవరో ఫలానా పార్టీలో చంపాలనుకుంటున్నారు అని పోలీసులకి ఎవరైనా ఇన్‌ఫాం చేస్తే, ఆ పార్టీకి పోలీసులు వెళ్ళి అతన్ని రక్షించే ప్రయత్నం చేస్తారు. ఇండియాలో ఫలానా వ్యక్తిని, ఫలానా పార్టీలో చంపుతామని, మీరేం పట్టించుకోవద్దని పోలీసులతో చెపితే అందుకు వాళ్ళు రేటు ముట్టచెబితే, హంతకుడిని పట్టుకోరు. పట్టుకున్నా బలమైన సాక్ష్యాలు సేకరించరు. ఒక్క పోలీస్ శాఖే అని ఏముంది? ప్రభుత్వాధీనంలో వున్న దాదాపు ఏ శాఖలోని ఉద్యోగికైనా డబ్బిస్తే కాని పనిని కూడా ఏదో విధంగా చేసిపెడతాడు. ఆ రూల్స్‌ని ఎలా బైపాస్ చేయాలో అతనే చెప్తాడు."

"నిజమే."

"ఈ వ్యవస్థ ఇంతగా కుళ్ళిపోయి వుండటం మనకిప్పుడు అడ్వాంటేజ్ అవుతోంది. "

"టు స్టార్ట్ విత్. మనం ఏం చేయాలి?" అడిగాడు విరించి.

"నువ్వు జిరాక్స్ షాపు నడిపిన్ ఎవిడెన్స్ కావాలి."

"దాని గురించేనా నా ఫ్రెండ్ ప్రభాకర్‌తో మాట్లాడాలంది?" అడిగాడు విరించి ఆసక్తిగా.

గోపీనాథ్ ప్రభాకర్‌తో మాట్లాడి ఒప్పించాడు. ప్రభాకర్‌కి వచ్చిన నష్టం ఏమీలేదు. కాబట్టి అతను అందుకే అంత తేలిగ్గా ఒప్పుకున్నాడు.

హనుమజ్జయంతి రోజున 'విరించి ఎస్.టి.డి అండ్ జిరాక్స్ షాపు' అన్న బోర్డ్‌ని, ప్రభాకర్ మల్కాజ్‌గిరిలో నడిపే ఎస్.టి.డి షాపు బోర్డ్ తీసి, ఆ స్థానంలో ఆ కొత్తబోర్డుని తగిలించారు. మామిడి ఆకులు, కొబ్బరి మట్టలు, అరటి బోదెలు కట్టి స్పీకర్లు కనిపించేలా వుంచిన ఆ షాపు బయటి భాగంలో షామియానా, కుర్చీలు వేయించి నాలుగు ఏంగిల్స్‌లో బయటనుంచి ఫోటోలు తీయించాడు గోపీనాథ్.

అదేరోజు షాపులో విరించి తల్లిదండ్రులు జిరాక్స్ యంత్రం, టెలిఫోన్‌లకి కొబ్బరికాయలు కొట్టి ఇనాగురేట్ చేసే ఫోటోలు కూడా తీయించాడు. ఫోటోలో గోడకున్న కేలండర్ లోని అంకెలు స్పష్టంగా కనబడేలా జాగ్రత్త తీసుకున్నాడు. పంతొమ్మిది వందల తొంభై తొమ్మిది మార్చి కేలండర్ అది.

ప్రింటింగ్ ప్రెస్‌కి ఆర్డరిచ్చి విరించి ఎస్.టి.డి అండ్ జిరాక్స్ షాపు మార్చి పదహారున ఓపెన్ అవుతోందని, స్థానికులు ఆ షాపుని ఉపయోగించుకోమని అభ్యర్థించే కరపత్రాలు వంద ముద్రించాడు.

షాపు చిరునామా గల ఆ పాంప్లెట్స్‌ని, ఆ ఫోటోలని ఎవిడెన్స్ అని ఓపెన్ చేసిన ఫైల్లో వుంచాడు గోపీనాథ్.

"రేపు అమెరికాలో ఐ.ఎన్.ఎస్ అధికారులు నిన్ను నానా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఇదంతా నువ్వు డైజెస్ట్ చేసుకుంటే అక్కడ తడబడకుండా సమాధానాలు చెప్పగలవు. ఇప్పుడు చెప్పు నీ జిరాక్స్ షాపు ఎప్పుడు ఓపెన్ చేశావు?" అడిగాడు గోపీనాథ్ విరించిని ఇంగ్లీష్‌లో.

"మార్చి సిక్స్‌టీన్త్."

"మార్చి సిక్స్‌టీన్త్ సర్" సర్‌ని వత్తిపలుకుతూ సరిదిద్దాడు గోపీనాథ్.

"మార్చి సిక్స్‌టీన్త్ సర్" చెప్పాడు విరించి.

"ఎన్ని గంటలకి?"

"ఉదయం ఎనిమిదిన్నరకి."

"దానికి ఎవిడెన్స్ వుందా?"

"వుంది సార్. ఇవి ఇనాగ్యురేషన్ ఫోటోలు. ఇవి ముందు రోజు పేపర్లో పెట్టి సర్క్యులేట్ చేసిన పాంప్లెట్స్."

"జిరాక్స్ యంత్రం ఖరీదెంత?"

"..."

"ఎన్ని కాపీలు ప్రింట్ చేయటానికి దాన్ని సెట్ చేయచ్చు మినిమం - మేగ్జిమం..."

"......"

"చూశావా? నువ్వు నిజంగా జిరాక్స్ షాపు నడిపితే ఈ ప్రశ్నలకు తేలిగ్గా జవాబు చెప్పగలిగేవాడివి. అవునా?"

"అవును."

"అర్థమైందా? ప్రతిదాంట్లో నువ్వు పూర్తిగా ఇన్‌వాల్వ్ అవుతే కానీ సమాధానాలు తెలీవు. అప్పుడు నీకు ఫస్ట్ హాండ్ ఇన్ఫర్మేషన్ వుంటుంది. ఓ వారం పాటు ప్రభాకర్ జిరాక్స్ షాపులో పనిచెయ్యి. కాపీకి ఎంత తీసుకుంటారు, ఆ మెషీన్ మేక్ ఏమిటి? ఎంతకి కొన్నారు? బేంక్ లోనైతే ఏ బ్యాంక్‌లో తీసుకున్నాడు, నెలకి ఆ షాపుకి అద్దె ఎంత? రెంటల్ అగ్రిమెంట్ వుందా, వుంటే ఎన్ని నెలల అద్దె అడ్వాన్స్ యిచ్చాడు, ఏ రకం కాగితాలు, డాక్యుమెంట్స్, జిరాక్స్‌కి ఎక్కువగా తీసుకువస్తారు? ఎలాంటి కాగితాలు వాడతారు, వాటి ఖరీదెంత, అవి ఏ కంపెనీవి తెస్తారు? ఇవన్నీ స్టడీ చెయ్యి."

"చేస్తాను. ఇప్పుడు నువ్వు నాకు టీచ్ చేయాలనుకున్నది పూర్తిగా అర్థమైంది. నేను ఇన్‌వాల్వ్ అయి అనుభవించి అంతా నేర్చుకోవాలి. అప్పుడు అమెరికాలో వాళ్ళడిగే ప్రశ్నలకి జవాబు తప్పుచెప్పే అవకాశం వుండదు" చెప్పాడు విరించి.

"అది మనసులో బాగా నాటుకో" హెచ్చరించాడు గోపీనాథ్.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments